ఆంధ్రజ్యోతి

andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.6, కనిష్ఠం 19.3

నిజామాబాద్
జిల్లా వార్తలు

5 గురువారం 6 ఫిబ్రవరి 2025



సకాలంలో పన్నులు చెల్లించాలి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో ప్రజలు ఆస్తి పన్నును సకాలంలో చెల్లించాలని ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పన్నుల వసూళ్ల కోసం ఐదు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశామని, మార్చి 31లోపు ఆస్తిపన్నులను చెల్లించాలన్నారు. అలాగే మిషన్ భగీరథ నీటి పన్నులను సైతం చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. మున్సిపల్ పరిధిలో ఉన్న వ్యాపార సంస్థలు ట్రేడ్ లైసెన్స్‌లు పొంది ఉండాలని ఆయన తెలిపారు.



'స్థానిక' ఎన్నికల్లో కీలకంగా
గ్రామాభివృద్ధి కమిటీలు!

- అభ్యర్థుల గెలుపు, ఓటములను నిర్ణయించనున్న వీడీసీలు
- వీరి మద్దతు ఉన్న వారికి గెలుపు అవకాశాలు అధికం
- అన్ని ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తున్న కమిటీ సభ్యులు
- గ్రామాల అభివృద్ధితో పాటు అన్ని పనుల్లో కమిటీలదే ముఖ్యపాత్ర
- జిల్లాలో వీడీసీల మద్దతు కూడగట్టేందుకు ప్రధాన పార్టీల ప్రయత్నాలు

నిజామాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాభివృద్ధి కమిటీలు (వీడీసీ) కీలకం కానున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల నుంచి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల వరకు గ్రామాభివృద్ధి కమిటీలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఏ అభ్యర్థికి మద్దతివ్వాలో నిర్ణయిస్తున్నాయి. గ్రామాభివృద్ధి కమిటీల కట్టుబాట్లు కట్టుదిట్టంగా ఉండటంతో కొన్ని గ్రామాలు అభివృద్ధి చెందుతుండగా.. మరికొన్ని గ్రామాల్లో వివాదాలకు తావిస్తున్నాయి. ప్రతీ విషయంలో కమిటీలే నిర్ణయం తీసుకుంటుండంతో వ్యతిరేకించే వారిపై చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని గ్రామాల పరిధిలో ఆంక్షలు కూడా విధిస్తున్నారు. వీటిపై జిల్లా అధికారుల వరకు ఫిర్యాదు చేయడంతో పాటు కొంత మంది కోర్టుల వరకూ వెళ్లారు. గ్రామాల్లో కట్టుదిట్టంగా ఉన్న ఈ కమిటీలు.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అభ్యర్థుల గెలుపు, ఓటములను నిర్ణయించనున్నాయి. గ్రామాల్లో వీరు నిర్ణయించే అభ్యర్థులే కొన్నిచోట్ల గెలిచే అవకాశాలు ఉన్నాయి. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండటంతో గ్రామాల్లో ఈ కమిటీల మద్దతును కూడగట్టుకునేందుకు ప్రధాన పార్టీల నేతలతో పాటు పోటీకి సిద్ధమవుతున్న వారు ప్రయత్నాలు చేస్తున్నారు. కమిటీలను ఆశ్రయిస్తూ తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.

జిల్లాలో 545 గ్రామ పంచాయతీలు

జిల్లా వ్యాప్తంగా 545గ్రామ పంచాయతీలు ఉండగా వీటిలో సగానికి పైగా గ్రామాల్లో ఈ గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)లు ఉన్నాయి. కొన్ని గ్రామాల కమిటీలు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తుండగా మరికొన్ని గ్రామాల్లో కమిటీలు అన్ని నియంత్రించే స్థాయికి చేరుకున్నాయి. గ్రామానికి సంబంధించిన అభివృద్ధిని చూడటంతో పాటు వివిధ షాపుల టెండర్ల నుంచి ఇతర పనుల వరకు ఈ కమిటీలే చేపడుతున్నాయి. గ్రామ పంచాయతీలకు ఎన్నికైన పాలకవర్గాలు ఉన్నా.. కొన్ని సార్లు ఈ కమిటీల నిర్ణయాలే ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయి. గ్రామాలకు వచ్చే ప్రజాప్రతినిధులతో పాటు అధికారులకు అభివృద్ధికి సంబంధించిన విషయాలను ప్రస్తావించడంతో పాటు నిధులు తెచ్చుకునేందుకు సంఘటితంగా పనిచేస్తున్నాయి. కొన్ని గ్రామాల పరిధిలో వివాదాలకు కూడా తావిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా ఈ గ్రామాభివృద్ధి కమిటీలు స్థానిక సంస్థలైన సర్పంచ్, వార్డు మెంబర్ ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. గ్రామ పంచాయతీల ఎన్నికలతో పాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా ఈ గ్రామాభివృద్ధి కమిటీలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఇవేకాకుండా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కొన్ని గ్రామాలకు చెందిన గ్రామాభివృద్ధి కమిటీలు కీలక నిర్ణయాలు తీసుకోవడంతో పాటు మద్దతు ఇచ్చిన వారు గెలిచిన తర్వాత పనులను చేసే విధంగా చూస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నేతలు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులను కలుస్తున్నారు. తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. తమను గెలిపిస్తే గ్రామాలకు కావాల్సిన పనులను చేసి పెడతామని హామీలను ఇస్తున్నారు. ప్రభుత్వం ఈనెలలోనే స్థానిక సంస్థలకు సంబంధించిన షెడ్యూల్ ప్రకటించనుండటంతో గత కొన్ని రోజులుగా గ్రామాల్లో నేతలు పర్యటిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సెర్ప్ డైరెక్టర్ ప్రశాంతి

స్వయం సహాయక సంఘ సభ్యుల ఆదాయ వివరాలు నమోదు చేయండి

- సెర్ప్ డైరెక్టర్ ప్రశాంతి

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘ సభ్యులు బ్యాంకు రుణాలు పొంది జీవనోపాధి ఏర్పాటు చేసుకున్న సందర్భంలో వారి ఆదాయ వివరాలు లోకోస్-అజీవికఈ రిజిస్టార్‌లో నమోదు చేయాలని సెర్ఫ్ డైరెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, గ్రామ సంఘ అసిస్టెంట్లతో బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఒక్క రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సభ్యురాలి కుటుంబ ఆదాయ వివరాలను అజీవిక రిజిస్టార్‌లో ఏ విధంగా ఎంట్రీ చేయాలనే దానిపై వివరించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో సాయాగౌడ్, రవీందర్, మురళి, తదితరులు పాల్గొన్నారు.



భీమ్‌గల్‌లో మృతి చెందిన కోళ్లు

అంతుచిక్కని వ్యాధితో కోళ్ల మృత్యువాత

- జిల్లాలో ఒకే రోజు 22వేల కోళ్ల మృతి
- ఆందోళనలో పౌల్ట్రీ నిర్వాహకులు

భీమ్‌గల్/వేల్పూర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం ఒకే రోజు అంతుచిక్కని వ్యాధితో 22వేల కోళ్లు మృతి చెందాయి. భీమ్‌గల్‌లో లీజుకు తీసుకుని నిర్వహిస్తున్న ఓ పౌల్ట్రీలో 14వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో సుమారు రూ.20లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిసింది. ఇంత భారీ మొత్తంలో నష్టం జరగడం ఇదే మొదటిసారి అని లీజుపై పౌల్ట్రీ నిర్వహిస్తున్న కొందరు వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు. అలాగే వేల్పూర్ మండలం మోతెలోని పౌల్ట్రీఫాంలో 7200 కోళ్లు మృతి చెందగా, లక్కోర గ్రామంలోని పౌల్ట్రీఫాంలో సుమారు 800 కోళ్లు మృతి చెందినట్టు వెటర్నరీ మండల అధికారి సంతోష్‌రెడ్డి తెలిపారు. కోళ్ల నుంచి రక్త నమూనాలను సేకరించి హైదరాబాద్‌లోని వెటర్నరీ లాజికల్ రిసర్చ్ ఇనిస్టిట్యూట్‌కు పంపినట్టు వెటర్నరీ వైద్యుడు సంతోష్‌రెడ్డి తెలిపారు. కాగా.. కోళ్ల మృతికి కారణం అంతు చిక్కని వ్యాధా!? లేకుంటే ఫాం నిర్వహణ లోపమా!? అన్నది తెలియాల్సి ఉంది.



కోళ్ల వివరాలను సేకరిస్తున్న అధికారులు

ఎలాంటి భయాందోళన చెందవద్దు.. : భరత్‌కుమార్ (పశు సంవర్ధక శాఖ ఏడీ, భీమ్‌గల్)

ప్రజలు భయాందోళన చెందవద్దని భీమ్‌గల్ ఏడీ భరత్‌కుమార్ అన్నారు. పౌల్ట్రీఫాం యజమానులు ఫారాలల్లో ప్రస్తుతం కొత్త చిక్స్ (కోడి పిల్లలు) వేయవద్దన్నారు. కోడిగుడ్డు, చికెన్ ఉడికించిన తర్వాతనే తీంటున్నాం కాబట్టి వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏడీ భరత్‌కుమార్ తెలిపారు.

చక్కెర ఫ్యాక్టరీ తెరిచేందుకు సర్కారు సానుకూలం

- వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్



మాట్లాడుతున్న గడుగు గంగాధర్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం జిల్లాలోని చక్కెర ఫ్యాక్టరీలను తెరవడానికి సానుకూలంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్ అన్నారు. ఎన్‌సీఎస్‌ఎఫ్ సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీ తెరిపించాలని బెల్లం కేంద్రంగా మార్చి ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేస్తూ చెరకు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ప్రగతినగర్ మున్నూరుకాపు సంఘంలో నిర్వహించిన రైతు సదస్సుకు హాజరైన గడుగు గంగాధర్ మాట్లాడుతూ పంట మార్పిడిలో భాగంగా చెరకు పంట వేయడానికి ఇక్కడ రైతులందరికి మంచి అనుభవం ఉందని గత పాలకులు తప్పుడు విధానాలు, అవినీతి అలసత్వం వల్ల చక్కెర ఫ్యాక్టరీ మూలన పడిందన్నారు. గతంలో రాజశేఖర్‌రెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి 6 కోట్ల రూపాయలు రైతులు అడగగానే కార్మికులకు జీతభత్యాల కోసం కేటాయించారని అన్నారు. రైతు కమి షన్ ఆధ్వర్యంలో సీఎంను కలిసి మాట్లాడుతామనని అం దుకు రైతు ప్రతినిధులు ముందుకు రావాలన్నారు. చెరకు ఉత్పత్తిదారుల నాయకులు లక్మారెడ్డి, ఆకుల పాపయ్యలు మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి రైతాంగ పోరాటాలు దోహదం చేశాయని నిజాంసాగర్ ఆయకట్టు స్థిరీకరణ, గుత్ప, అలీసాగర్ పథకాలు రైతుల పోరాటాల వల్లే వచ్చాయన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలకు సమావేశంలో ఆమోదం తెలిపారు. ఈ సదస్సులో లక్ష్మణ్‌రెడ్డి, సంతోష్, లక్మారెడ్డి, పృథ్వీరాజ్, నాగయ్య, వేల్పూర్ భూమయ్య, వినయ్, సిర్పనాగయ్య, భూమారెడ్డి, సిర్పలింగం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య, పక్కన ఎమ్మెల్యే ధన్‌పాల్

విద్యారంగాన్ని భ్రష్టుపట్టించిన ప్రభుత్వాలు

- ప్రభుత్వ విద్యాసంస్థలన్నీ నిధులు లేక నిర్వీర్యం
- బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్య

నిజామాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో విద్యారంగాన్ని ప్రభుత్వాలు భ్రష్టుపట్టించాయని బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్య ఆరోపించారు. నగరంలో బుధవారం పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యావిధానంలో ఎలాంటి మార్పులు రాలేదన్నారు. విద్యా ప్రమాణాలు పెరగలేదన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు కూడా పరిష్కారం కాలేదన్నారు. ప్రతీ సంవత్సరం విద్యకు ఎక్కువ నిధులు కేటాయించాల్సి ఉన్నా తగ్గిస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలు విభిన్నమైన మార్గాల్లో నడుస్తున్నాయన్నారు. తనకు అవకాశం ఇచ్చి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపిస్తే సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రయత్నాలు చేస్తానని ఆయన తెలిపారు.

కులగణన తప్పుల తడకగా : బీజేపీ జిల్లా అధ్యక్షుడు

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కులగణన తప్పుల తడకగా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆరోపించారు. అన్ని వర్గాలను మోసం చేసే విధంగా ఈ కులగణన ఉందన్నారు. కులగణనలో క్రైస్తవులకు సంబంధించిన లెక్కలు తేల్చలేదన్నారు. ముస్లింలో ఉన్న బీసీలను కలిపి ఎక్కువ మొత్తంలో చూపెట్టారని అన్నారు. గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్కా కొమురయ్యలను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

పార్టీ నేతలకు బాధ్యతల అప్పగింత...

బీజేపీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి మల్కా కొమురయ్య గెలుపు కోసం పార్టీ నేతలు కసరత్తు చేశారు. నగరంలో బుధవారం జరిగిన పార్టీ పదాధికారుల సమావేశంలో విస్తృతంగా చర్చించారు. పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారితో పాటు పార్టీ నేతలు అందరూ హాజరుకాగా పూర్తిస్థాయిలో చర్చించారు.



● రాథోడ్‌వాగు జలాశయం



● ఆనవాళ్లు కోల్పోయిన పంట కాలువలు



28 ఏళ్లుగా చుక్కనీరందించని
రాథోడ్ వాగు ప్రాజెక్టు

- చౌట్‌పల్లి రాథోడ్‌వాగు ప్రాజెక్టుకు పట్టిన గ్రహణం వీడేదెన్నడు ?
- 28 ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని పిల్లకాలువల పనులు
- నిండా నీరున్నా.. వినియోగించుకోలేని దుస్థితి
- బోరుబావుల ఆధారంగానే పంటలు సాగుచేస్తున్న రైతులు



కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌట్‌పల్లి గ్రామ శివారులో గల పడావు భూములకు సాగు నీరందించడానికి నిర్మించిన రాథోడ్‌వాగు ప్రాజెక్టు.. 28ఏళ్లు గడుస్తున్నా సాగుభూములకు చుక్కనీరు అందిన దాఖలాలు లేవు. 1987 అక్టోబరు 29న అప్పటి రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి కేఈ కృష్ణ మూర్తి, చిన్నతరహా నీటిపారుదల శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలేటి మహిపాల్ రెడ్డి ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.66 లక్షల నిధులతో శంకుస్థాపన చేశారు. అయితే పనుల్లో నాణ్యతాలోపాలు, ఇంజనీర్ల బాధ్యతారాహిత్యం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వెరసి రాథోడ్‌వాగు నిర్మాణానికి దాదాపు 10 సంవత్సరాలు కాలం పట్టింది. కానీ ప్రాజెక్టు నుంచి చౌట్‌పల్లి, రంగారావుపేట్ గ్రామాల పడావు భూములకు ఇప్పటివరకు చుక్క సాగు నీరందిన దాఖలాలు లేవు. అధికారుల నిర్లక్ష్య వైఖరికి ఈ ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందన్న ఆరోపణలున్నాయి. కుడి కాలువ ద్వారా చౌట్‌పల్లి గ్రామానికి చెందిన ఆరు వందల ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా కరీంనగర్ జిల్లా రంగారావుపేట్ గ్రామానికి చెందిన మరో ఆరు వందల ఎకరాల పడావు భూములు సాగులోకి తీసుకురావడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. అయితే ఈ ప్రాజెక్టులో నిండా నీరున్నా.. 28ఏళ్లుగా సెంటు భూమికి సాగు నీరందలేదు. దీంతో ఈ ప్రాంత రైతులు ఏళ్లతరబడి ప్రాజెక్టు సాగు నీటి కోసం ఎదురుచూసి చివరకు కొందరు రైతులు భారీ ఖర్చుతో బోరుబావులు వేయించుకుని వ్యవసాయం చేస్తున్నారు. ప్రాజెక్టు నిర్మించిన నాటి నుంచి చుక్కనీరు బైటకు రాకపోగ అందులోని నీరు కలుషితమై అటు చేపలు మరణించగా, నీరు తాగిన పశువులు అనారోగ్యం పాలవుతున్నాయి. దీంతో అధికారులు స్పందించి మత్తడిని కూల్చివేసి ప్రాజెక్టులో నిలువున్న నీటిని కొంతమేర బైటకు వదిలేశారు. వర్షాకాలంలో ప్రాజెక్టులోకి నీరు చేరి నిండుదనం సంతరించుకుంది. కానీ చుక్కనీరు పంటభూములకు అందకుండా మురుగునీటిని తలపిస్తోంది. ప్రాజెక్టు కుడి ఎడమ పంట కాలువల నిర్మాణాలకు నిధులు మంజూరై పనులు సాగినా.. నాసిరకం పనులకు తోడు భూముల అభివృద్ధితో ఈ కాలువలు ప్రస్తుతం ఆనవాళ్లు కోల్పోయాయి. కాగా, అప్పటి మిషన్ భగీరథ వైస్ చైర్మన్ బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి 2017 మే 25న నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధిశాఖ నుంచి ఆర్‌ఆర్‌ఆర్ పథకంలో రూ.62.35 లక్షలు మంజూరు చేయించి మరమ్మతు పనులు చేయించారు. కానీ కలువల పనులు మాత్రం కొద్ది దూరం కొనసాగి అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీంతో 28 ఏళ్లుగా విసిగి వేసారిన ఈ ప్రాంత రైతులు భారీ ఖర్చులతో బోర్లు వేయించుకుని పడావు భూములను పంట భూములుగా మార్చుకొని సాగుచేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రాజెక్టు కాలువలద్వారా నీరు సరఫరా అయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఫటా..ఫట్...

టీయూ పరిధిలో గల కళాశాలలు నిబంధనలు పాటించాలి

● టీయూ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్



టీయూ పరిధిలో కళాశాలలు నిబంధనలు పాటించాలని విద్యార్థులకు కావాల్సిన అన్నిరకాల మౌళికసదుపాయాలు ఉండేలా కళాశాలలు చర్యలు తీసుకోవాలని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ తెలిపారు. పరీక్షల కేంద్రాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ప్రశ్న: టీయూ పరిధిలో ఎన్ని కళాశాలలు ఉన్నాయి

జవాబు: వర్సిటీ పరిధిలో ప్రస్తుతం పీజీ 24, డిగ్రీ 54 కళాశాలలు కొనసాగుతున్నాయి

ప్రశ్న: వార్షిక తనిఖీలు చేస్తున్నారా?

జవాబు: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని కళాశాలలను వార్షిక తనిఖీల్లో భాగంగా ప్రతి యేడాది మార్చి నెలలో తనిఖీ చేస్తాము.

ప్రశ్న:నిబంధనలు పాటించని కళాశాలపై చర్యలు తీసుకున్నారా?

జవాబు: వార్షిక తనిఖీల్లో భాగంగా నిబంధనలు పాటించని 6కళాశాలలపై ఇప్పటికే చర్యలు తీసుకున్నాం.వాటిని పూర్తిగా మూసివేశాము.

ప్రశ్న:కళాశాల తనిఖీల్లో ఎలాంటిసదుపాయాలు పరిశీలిస్తారు?

జవాబు:విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలు పుస్తకాలు, లైబ్రెరీ,క్రీడ మైదానం,తరగతి గదులు,ల్యాబ్‌లు, కనీస సౌకర్యాలను విద్యార్థులకు అందుతున్నయో లేదో పరిశీలి స్తాము.

ప్రశ్న: పరీక్షల నిర్వహణ తీరు ఎలా ఉంది?

జవాబు:వర్సిటీ పరిధిలో జరుగుతున్న పరీక్షలను పకడ్బందీగా కొనసాగిస్తున్నం.పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, మూత్రశాలలు వంటి సదుపాయాలను ఏర్పాటు చేసేల చర్యలు తీసుకుంటున్నం.

● (ఆంధ్రజ్యోతి,డిచ్‌పల్లి)

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి శివారులో 44వ జాతీయరహదారిపై దేగాం గ్రామానికి చెందిన గూండ పెద్ద గంగారాంకు కారు ఢీకొని తీవ్రగాయాల య్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం గంగారాం తన ద్విచక్ర వాహనంపై అర్గుల్ నుంచి తొర్లికొండకు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని కారు ఢీకొట్టడంతో గంగారాం చేతుకు, తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలుశిక్ష

బోధన్‌రూరల్,ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో మద్యం అధికంగా తాగి వాహనాన్ని నడిపించిన హున్సా గ్రామానికి చెందిన మధుకర్, బోధన్‌లోని బీటీనగర్‌కు చెందిన ఇంతియాజ్‌కు బుధవారం బోధన్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి శేషతల్పసాయి మధుకర్‌కు ఒక రోజు, ఇంతియాజ్‌కు రెండు రోజుల జైలుశిక్ష విధించినట్లు పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయని, పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

ప్రతీ మహిళ డ్వాక్రా సంఘాలలో చేరి ఆర్థికంగా రాణించాలి

బోధన్‌రూరల్,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ డ్వాక్రా సంఘాలలో చేరి ఆర్థికంగా రాణించాలని మోప్మా ఏపీఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం పురపాలక సంఘ పరిధిలోని మహిళలందరితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళల అభివృద్ధి కొరకు కృషి చేస్తుందన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళ సంఘం సభ్యురాలిగా చేరి ప్రభుత్వం అందించే పథకాలలో లబ్ధిపొందాలని సూచించారు. అందుకోసం వార్డుల వారిగా ప్రత్యేకంగా కొత్త సంఘాలలో సభ్యులను చేర్పించడం జరుగుతుందన్నారు. 4వ తేది నుండి 10వ తేది వరకు ఈ ప్రత్యేక కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పేద, మధ్య తరగతి మహిళలు అందరు 18సంవత్సరాల నుండి 59సంవత్సరాల లోపు మహిళలు సంఘాలలో చేరి పొదుపు చేస్తే బ్యాంకులు ఇతర సామాజిక సంస్థల నుండి రుణాలు పొందుతూ, ఆర్థికంగా, సామాజికంగా, ఆరోగ్యపరంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల మహిళలు తదితరులున్నారు.

గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి సీఎం ప్రత్యేక దృష్టి

● దుబాయిలో గల్ఫ్ కార్మికులను కలిసిన ఈరవత్రి అనిల్



దుబాయిలో ఈరవత్రి అనిల్‌ను సన్మానిస్తున్న ప్రవాసీయులు

భీమ్‌గల్‌రూరల్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): గల్ఫ్ వలస కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, వారి సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని యుఏఈ పర్యటనలో ఉన్న మాజీఎమ్మెల్యే, తెలంగాణ మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ అన్నారు. బుధవారం దుబాయిలోని హోటల్ వద్ద తెలంగాణ ప్రవాసీయులు అనిల్‌కు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికిన సంద ర్భంగా ఆయన కార్మికులతో ముచ్చటించారు. కార్యక్రమంలో సుతారి సత్యం, సంగి దేవేందర్‌రెడ్డి, మంద బీంరెడ్డి, ఎస్.వేణు, గడ్డం శశిధర్ పాల్గొన్నారు.

పదవులను ఆశించి వచ్చిన వారిని నమ్మవద్దు

మోస్రా,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను నియోజకవర్గ నాయకులు ఇంటి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు అధైర్యం పడవద్దన్నారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి పదవి కోసం మాత్రమే కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారని, ఏనుగు రవీందర్ రెడ్డి మన పార్టీ కార్యకర్తలు బాగుండాలని ఎన్నో కార్యక్రమాలు చేశారన్న విషయాన్ని గుర్తుకు పెట్టుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యలమంచిలి శ్రీనివాస్, నస్రుల్లాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు నందురెడ్డి పాల్గొన్నారు.

పదవీ విరమణ సహజం

వేల్పూర్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల పీటీఎఫ్ గంగారాం ఇటీవల పదవీ విరమణ పొందారు. బుధవారం మండలంలోని అమీనాపూర్ ప్రాథమిక పాఠశాలలో గంగారాంను ఎంఈవో రేణుక, ఉపాధ్యాయులు శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీరాంగోపాల్, కాంప్లెక్స్ హెచ్‌ఎం మల్లేశ్వరి, ఉపాధ్యాయులు సరస్వతి, రాములు, శ్రీనివాస్, విజయ్‌కుమార్, సునీల్‌కుమార్, రఘునాథ్, నాగేంద్ర, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు దేశ భవిష్యత్ కోసం సాంకేతిక రంగాలలో రాణించాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌రూరల్,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దేశ భవిష్యత్ కోసం సాంకేతిక రంగాలలో రాణించాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని విద్యావికాస్ జూనియర్ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం రోజున 101అడుగుల ఎత్తులో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఫైజానూరి విద్యావికాస్ కళాశాలకు చెందిన ఇంటర్ ఎంఈసీ విద్యార్థినికి లక్ష రూపాయలు ఆమె ప్రసంగానికి ముగ్ధుడై లక్ష రూపాయలు ఇస్తానని మాట ఇచ్చిన ప్రకారం బుధవారం కళాశాలకు హాజరయ్యారు. ఫైజానూరి బృందాన్ని అభినందిస్తూ 1.10 లక్షల రూపాయల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ విద్యకు హబ్‌గా మారిందని, ఇది చాలా గొప్ప విషయం అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని, విద్యార్థులు మేధాశక్తిని పెంపొందించుకుని సాంకేతికంగా దేశానికి ఉపయోగపడే విధంగా సైంటిస్టులుగా రాణించాలన్నారు.140కోట్లు ఉన్న జనాభా ఇంకా విదేశాల నుండి వస్తున్న వస్తువులపై ఆధారపడి ఉందని, కేంద్రం దేశయువతకు అనుమతులు ఇస్తే మనదేశంలోనే ఎన్నోరకాల వస్తువులను తయారు చేసుకోవచ్చన్నారు. ఇటీవల బెల్లాల్‌లో రూ.22కోట్లలతో నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేశామన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలోనే మెడికల్ కళాశాలను ఏర్పాటు చేశామని, నేడు అనేక మంది డాక్టర్లుగా తయారై ఆసుపత్రులలో ప్రజలకు వైద్యం అందిస్తున్నారన్నారు. పాలిటెక్నిక్ ఇలా ఆధునాతన కళాశాలలను ఏర్పాటు చేస్తే భావి తరాల పిల్లలకు వారి ఉజ్వల భవిష్యత్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి దురాలవాట్లకు దూరంగా ఉండి బాగా చదివి తల్లిదండ్రులతో పాటు కళాశాలకు రాష్ట్రానికి మంచి పేరు తెచ్చి పెట్టాలన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ వారి చేతుల్లోనే ఉందని, ఎలాంటి దురాలవాట్లు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి సాంకేతికంగా, సైంటిస్టులుగా తయారై దేశానికి సేవ చేయాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. బోధన్ ఏకచక్ర సేవా సమితి అంబేద్కర్ చౌరస్తాలో 101 అడుగుల జాతీయ జెండాను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఏకచక్ర సేవా సమితి బృందాన్ని అభినందించి మరిన్ని సేవ కార్యక్రమాలు బోధన్‌కు అందించాలన్నారు. రైతులకు కావాల్సిన ఎత్తిపోతల పథకాలు వంటి ఎన్నో సంక్షేమ పథకాలు, బోధన్ పట్టణ ప్రజలకు అవసరమయ్యే తాగునీటి పథకాలు కాంగ్రెస్ హయాంలోనే జరిగాయన్నారు. గత ప్రభుత్వాలు కాలయాపన చేశారే తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి తమ పరిశ్రమాలను రాష్ట్రంలోనే ప్రవేశపెట్టి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గ్రంథాలయ సంస్థల చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షులు కొడాలి కిషోర్ కుమార్, అధ్యాపక బృందం, విదార్థులు తదితులు పాల్గొన్నారు.

మోస్రాలో తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మ దహనం



మోస్రాలో తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

మోస్రా,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మోస్రా మండల కేంద్రంలో జిల్లారెడ్డి సంఘాల ఆధ్వర్యంలో తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. రెడ్డిల కులం పట్ల వరంగల్ జిల్లాలో అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ తీన్మార్ మల్లన్న దిష్టిబొమ్మను దహనం చేశారు.అట్టివ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు నాగిరెడ్డి, వర్ని మండల అధ్యక్షుడు రాంరెడ్డి, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గంగారెడ్డి, మోస్రారెడ్డి సంఘం అధ్యక్షుడు లచ్చారెడ్డి, గోవూర్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, చింతకుంట అధ్యక్షుడు నర్సారెడ్డి, సుధాకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సంగారెడ్డి, సైనపురం రాంరెడ్డి, విఠల్ రెడ్డి, సైనపురం నర్సారెడ్డి పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి

భీమ్‌గల్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం మండలంలోని లింబాద్రిగుట్ట వద్ద మండల వీఆర్‌ఏల సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, రెవెన్యూ, ప్రజల వారదిగా ఉంటున్న వీఆర్‌ఏలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం 81, 85జీవో తీసుకువచ్చి రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న 20వేల 545మంది నుంచి 16వేల 758మందికి వివిధ శాఖల్లో భర్తీ చేసిందని, కానీ 3787మందికి వయస్సు పైబడిందని చెప్పి మొండి చేయిచూపిందని, ఇప్పటి ప్రజాపాలన ప్రభుత్వమైన స్పందించి జీవో ప్రకారం వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహానికి రూ.5లక్షల 50వేల విరాళం

ముప్కాల్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లూర్ గ్రామంలో ఏర్పాటు చేయనున్న 12అడుగుల భారీ హన్మాన్ విగ్రహ నిర్మాణం కోసం బీజేవైఎం స్టేట్ వైస్‌ప్రెసిడెంట్ నాయకుడు సంతోష్ రూ.2లక్షల 50వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నల్లూర్ గ్రామంలో హన్మాన్ సేవ స్వాములు, గ్రామ ప్రజలు నాయకుడు సంతోష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జీవన్, సత్యనారాయణ, గంగారెడ్డి, వీడీసీసభ్యులు, పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఇద్దరికి తీవ్రగాయాలు

ఆర్మూర్‌టౌన్,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి యోగేశ్వరకాలనీలో కుక్కల దాడిలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. బుధవారం సాయంత్రం పాఠశాల నుంచి వచ్చిన గుజరాతి వీవన్స్ ఐదేళ్ళ బాలుడు కాలనీలో అడుకుంటుండగా కుక్కలు దాడి చేశాయి. అక్కడే ఉన్న కిశోర్ అనే వ్యక్తి వాటిని తరుమగా అతనిపై కుక్కలు దాడికి దిగాయి. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ బాలుడిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళారు.

● వీధి కుక్కలను నియంత్రించాలి

మున్సిపల్ పరిధిలో ప్రతీవార్డుల్లో, ప్రతీ గల్లీల్లో వీధికుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని వాటిని నియంత్రించాలని మున్సిపల్ ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు. నిత్యం ఏదో ఒక చోట వీధికుక్కలు ప్రజలపై దాడులు చేస్తున్నాయని, బయటకు వెళ్లాలంటే భయనక పరిస్థితులను ఎదుర్కొంటున్నామని, అత్యవసర పరిస్థితుల్లో తప్ప పిల్లలను బయటకు పంపడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు వీధి కుక్కల నియంత్రణపై దృష్టి సారించి వాటి దాడుల నుంచి ప్రజలను రక్షించాలని వేడుకుంటున్నారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

నవీపేట,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీనగర్ సమీపంలో ఈ నెల 3న నందిపేట మండలం ఐలాపూర్ నుంచి నవీపేట వైపు బైక్ వస్తుండగా ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై ఉన్న భార్య భర్తలు పోతుగంటి భూమన్న, పుష్పలకు తీవ్ర గాయాలయ్యాయని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. కారును అజాగ్రత్తగా నడపడంతో బైక్‌పై ఉన్న భార్యభర్తలకు తీవ్ర గాయాలయ్యాయని, బాధితుడు భూమన్న మేనల్లుడు కాసుల గంగాధర్ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ చిదరబోయిన వినోద్ మురళీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ నెల 3న గాంధీనగర్ సమీపంలో కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన విషయం విదితమే.

బీసీలకు ప్రభుత్వం 42శాతం ప్రకటించడం పట్ల కాంగ్రెస్ నాయకుల హర్షం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ ప్రకటించడం పట్ల జక్రాన్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌రూరల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్ మాట్లాడుతూ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు 42శాతం రిజర్వేషన్ ప్రకటించిన సందర్భంగా బీసీలకు పెద్దపీట వేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో డైరీ ఆవిష్కరణ



పోచంపాడ్ జెన్‌కోలో డైరీ ఆవిష్కరిస్తున్న రమేష్‌బాబు

మెండోర, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): పోచంపాడ్ జల విద్యుత్ కేంద్రంలో డైరీలను జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం సీఈ రమేష్‌బాబు బ్రాంచ్ సెక్రెటరీలు సతీష్ కుమార్, భరత్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ అసోసియేషన్‌కు సంబంధించిన డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెన్‌కోలో ఎస్‌ఈ శ్రీనివాస్, డీఈ శ్రీనివాస్, అసోసియేషన్ నాయకులు సాందయ్య, నితిన్, దేవరాజ్, హేమలత, 1104యూనియన్ రాష్ట్ర నాయకుడు రఫిక్, శ్రీనివాస్, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

కూనేపల్లి బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌పై పోలీసులకు ఫిర్యాదు

రెంజల్,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కూనేపల్లి గ్రామానికి చెందిన బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ గంగారాంపై అదే గ్రామానికి చెందిన గైని గంగాధర్ అనే వ్యక్తి రెంజల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ తమ విధులకు అటంకాలు కలిగిస్తూ కుటుంబాన్ని అవమానపరుస్తున్న బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ గంగారాంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించకపోతే ఉద్యమిస్తాం



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

వర్ని,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, శ్రామిక ప్రజానీకానికి వ్యతిరేకంగా ఉందని బడ్జెట్‌ను సవరించి తెలంగాణ రాష్ట్రానికి నిధులు కేటాయించాలని కోరుతూ సీపీఎం పార్టీ మండల నాయకులు సాయిబాబు, సురేష్ బుధవారం తహసీల్దార్ సాయిలుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో పసుపు బోర్డు, జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం, బోధన్ నుండి బీదర్ వరకు రైల్వే లైన్, నిజాంషుగర్ ఫ్యాక్టరీ నిర్మాణ పనుల ఊసే ఎత్తలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌ను సవరించకపోతే ప్రజలు తిరుగుబాటు చేస్తారని హెచ్చరించారు.

అధికారుల పొలంబాట

బోధన్‌రూరల్,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): రైతులకు నిరంతరం విద్యుత్ సౌకర్యం అందించాలన్న ఉద్దేశంతో రైతులు ప్రమాదాల బారిన పడకుండా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పిస్తూ విద్యుత్ శాఖ టెక్నికల్ డీఈ రమేష్ పొలంబాట నిర్వహించారు. రైతులు తమ పంట పొలాల్లో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ బోధన్ డీఈ ముక్తార్ హైమద్, విద్యుత్ శాఖ అధికారులు నాయిని కృష్ణ, ఆయా పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సభ్యులు

ముప్కాల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మాదిగ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి, అంబేద్కర్ విగ్రహానికి మండల మదిగ సంఘాల సభ్యులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ ముత్యాల శ్రీనివాస్, రాజ్‌కుమార్, రాజన్న, గంగాధర్, అజయ్, మాదిగ సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

ఆర్మూర్‌రూరల్: పట్టణంలోని పీవీఆర్ భవన్‌లో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఓబీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కుల గణనను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా చిత్రపటాలకు పాలాభిషేకం చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, మాజీమున్సిపల్ వైస్‌చైర్మన్ లింగాగౌడ్, రేగుల్ల సత్యనారాయణ, వేణు, నరేష్, తోట సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలు బడులలో ఉండాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

బోధన్‌రూరల్,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): బడి ఈడు పిల్లలు బడులలో ఉండాలని పాఠశాలలో చదివే విద్యార్థులచే తల్లిదండ్రులు పనులు చేయించవద్దని విద్యాశాఖ అధికారులు అన్నారు. బుధవారం బోధన్ మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో బడి బయట పిల్లల గుర్తించి అవగాహనకల్పించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సైతం అవగాహన కల్పించారు. పిల్లలను తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): రెండోసారి నూతనంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారిని బుధవారం బీజేపీ జిల్లా కిసానమోర్చ అధ్యక్షుడు పి.తిరుపతిరెడ్డి ఘనంగా సన్మానించారు.. అనంతరం దినేష్ కులచారిని శాలువా , పూలమాలతో ఘనంగా సత్కరించారు. రైతుల తరపున పోరాటాలు చేసి రైతులకు అండగా ఉండాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వేణుగోపాల్ యాదవ్



సీఎంని సన్మానిస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీ కులగణన చేపట్టి రాష్ట్ర అసెంబ్లీలో తీర్మాణం చేసిన సందర్భంగా టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ జూబ్లీ హిల్స్‌లోని ఆయన నివాసంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు ఈసందర్భంగా సీఎంకు శాలవ కప్పారు. రాష్ట్రంలో బీసీలకు రాజ్యాధికారం ఇవ్వలన్న తపనతో, స్థానిక సంస్థల్లో పార్టీ పరంగా కూడ 42 శాతం రిజర్వేషన్ అమలుకు కాంగ్రెస్ పార్టీ సిద్దంగా ఉందన్న ప్రకటన చేసినందుకు సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ధర్పల్లిలో జాతీయ బాలికల దినోత్సవం



ధర్పల్లి జాతీయ బాలికల దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థినిలు

ధర్పల్లి, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి):ధర్పల్లి మండల కేంద్రంలోని కేజీబీవీ హాస్టల్‌లో బుధవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలకు బాలిక విద్య, లింగ వివక్షత, బాలల హక్కులు, ఫోక్సో యాక్ట్, గుడ్‌టచ్, బాడ్ టచ్, చైల్డ్ హెల్ప్, లైన్ నెంబర్ గురించి అవగాహన కల్పించారు. అలాఈగే విద్యార్థినిలకు డ్రాయింగ్, పాటలు, స్పీచ్ వంటి పోటీలు నిర్వహించగా గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ సరిత, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ రంజిత్, డీహెచ్‌డబ్ల్యు కోఆర్డినేటర్ పుష్ప, కేజీబీవీ ఎస్‌వో సుమలత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్టు



ముప్కాల్‌లో అరెస్టు అయిన మాజీసర్పంచ్‌లు

సిరికొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని హైదరాబాద్ వెళ్తున్నారని సమాచారం తెలుసుకున్న పోలీసులు మండలానికి చెందిన మాజీ సర్పంచ్‌లను బుధవారం ముందస్తుగా అరెస్టు చేశారు. మంగళవారం నాడు సైతం మండలానికి చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసిన పోలీసులు బుధవారం నాడు కొండాపూర్, సిరికొండ, చీమన్‌పల్లి, న్యావనంది, తదితర గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ముప్కాల్:ముప్కాల్,బాల్కొండ మండలాలకు చెందిన వివిధ గ్రామాల తాజామాజీసర్పంచ్‌లను మంగళవారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులు చె ల్లిం చాలని చలో హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకోవడంలో భాగంగా మాజీసర్పంచ్‌లను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిలో మాజీ సర్పంచ్‌లు మట్ట సందీప్, ఆకుల రాజేశ్వర్, మారెల్లి విష్ణు, బూస నరే హరి, తదితరులు పాల్గొన్నారు.

ఆహార కల్తీపై చైతన్య సదస్సు



అంగన్‌వాడీ సెంటర్‌లో ఆహారకల్తీపై చైతన్యసదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హుస్నాబాద్‌కాలనీ అంగన్‌వాడి సెంటర్‌లో మండల వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో బుధవారం ఆహార కల్తీ, పాలలో కల్తీపై చైతన్య సదస్సు నిర్వహించారు. 89వ అంగన్‌వాడి సెంటర్‌లో తల్లిదండ్రులకు ఉప్పులో ప్లాస్టిక్, అయోడిన్ లేని ఉప్పు, మోయనైస్ హానీకరమైన పదార్థాలు, ఫోర్టిఫైడ్ బియ్యం నిల్వ, చికెన్‌లో గ్లూటమోట్ మోనోపోడియం, పాలలో హైడ్రోజన్ పెరాక్సైడ్, అమ్మోనియం సల్ఫేట్,యూరియాకల్తీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాంబారురాజు,చక్రపాణి, రాజుల రమానాథం, అనిల్ కుమార్, ప్రవీణా, సూపర్‌వైజర్ నలిని, అంగన్‌వాడి టీచర్ ఆకుల లక్ష్మీ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



రైల్వేగేటు వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసిన దృశ్యం

బోధన్‌రూరల్,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని బోధన్ ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని రైల్వేగేటు వద్ద బారికేడ్లను ఏర్పాటు చేశారు. రైలు వచ్చే సమయంలో మున్సిపల్ కార్యాలయం నుండి వచ్చే వాహనాలు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వీరు తిరిగి ఉర్దూగర్ మీదుగా తిరిగి రావాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తప్పకుండా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు.

తొలగించిన కార్మికులను పనిలోకి తీసుకోవాలి

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం మగ్గిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొలగించిన మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులను వెంటనే పనుల్లోకి తీసుకోవాలని బుధవారం సీఐటీయు నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ కుతాడి ఎల్లయ్య మాట్లాడుతూ గత 15ఏళ్లుగా సుంకరి కాంతమ్మ, ఎరక మల్లుబాయి, గుండె సాయమ్మలు ఉన్నత పాఠశాలలో వంటలు చేస్తున్నారని కట్టెల పొయ్యి మీద మధ్యాహ్న భోజనం వండుతూ అనారోగ్యం బారినపడిన ప్పటికీ విద్యార్థులకు భోజనం అందించేందుకు నిరంతరం కృషి చేశారన్నారు. అటువంటి వారిని పనిలో నుంచి తొలగించడం అన్యాయమన్నారు. బిల్లులు రానప్పటికీ కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు ఇదా అని ఎల్లయ్య ప్రశ్నించారు. తొలగించిన కార్మికులను వెంటనే పనుల్లో పెట్టుకోవాలని, లేకుంటే సీఐటీయు ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో సాయిరాం, తహసీల్దార్, ఎంఈవో కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జక్కం సుజాత, కుల్‌దీప్‌శర్మ, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

అమీనాపూర్ ఆలయంలో చండీయాగం



అమీనాపూర్ ఆలయంలో చండియాగం నిర్వహిస్తున్న భక్తులు

వేల్పూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమీనాపూర్ గ్రామసమీపంలో ఆలయంలో ఆలయ కమిటీ, భక్తుల ఆధ్వర్యంలో బుధవారం శత చండీయాగం ఉత్సవాలను నిర్వహించారు. ఈ యాగంలో వివిధ గ్రామాలకు చెందిన భక్తులు దంపతులతో సహ పెద్ద ఎత్తున యజ్ఞ హోమం నిర్వహించారు. అంతకు ముందు గణపతిపూజ, పంచమండప ఆరాధన, లలిత సహస్ర పారాయణం, విగ్రహాలకు పంచామృతాభిషేకం, మహాపూజ, మహాహారతి, తీర్థప్రసాద వితరణ వంటి కార్య క్రమాలు నిర్వహించారు. భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి చండియాగం, కుంభా భిషేకం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



అంతంపల్లిలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వనదుర్గ పెద్దమ్మ ఆలయంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి విగ్రహంతో పాటుగా దేవతామూర్తుల విగ్రహాలను గ్రామంలో డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగించి వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల నడుమ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల పరిశ్రమను పరిశీలించిన ఒరిస్సా, శ్రీకాకుళం కేంద్ర బృందం



రైతు ఉత్పత్తిదారుల సంఘ పరిశ్రమను సందర్శించిన కేంద్ర ప్రభుత్వ శాస్త్రవేత్తల అధికారులు

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న జెఎంపీఎం రైతు ఉత్పత్తిదారుల సంఘ పరిశ్రమను బుధవారం ఒరిస్సా, శ్రీకాకుళం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన కేంద్ర ప్రభుత్వ శాస్త్రవేత్తలు సందర్శించారు. శ్రీకాకుళం జిల్లా గిరిజన ప్రాంతానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు జిల్లాలోని మనోహరాబాద్ గ్రామంలో నిర్మించిన రైతు ఉత్పత్తిదారుల సంఘ పరిశ్రమను సందర్శించారు. ఎఫ్‌ఈవో గ్రూపుల నిర్మాణం, బలోపేతంపై డైరెక్టర్లు పి.తిరుపతిరెడ్డి, నల్లారి సంతోష్ కేంద్ర ప్రభుత్వ అధికారులకు వివరించారు. వారి వెంట వెలుగు సంస్థ ప్రతినిధులు రూపేష్, కుమార్‌నాయక్, జనార్ధన్ బిగాల్, సదానంద్‌ప్రధాన్, తిరుపతిరావు ఉన్నారు.

భక్తి



పూజలు చేస్తున్న దృశ్యం



కోనేరులో స్నానం చేయిస్తున్న దృశ్యం



ఉత్సవ విగ్రహాలను తీసుకువస్తున్న అర్చకులు

శాస్త్రోక్తంగా నీలకంఠేశ్వరుని చక్రతీర్థం

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వైభవోపేతంగా రథోత్సవాన్ని జరుపుకున్న నీలకంఠేశ్వర స్వామి బుధవారం శాస్త్రోక్తంగా చక్రస్నానం ఆచ రించారు. ప్రసిద్ధ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వర ఆలయంలో వేదపండితుల వేద మంత్రోచ్చరణలతో ఆలయ ప్రాంగణంలోని కోనేరులో శివపార్వతులకు చక్రతీర్థం నిర్వహించారు. ఆలయ గర్భగుడి నుంచి మేళతాళాలతో కోనేరు వరకు ఊరేగించి ఆలయ అర్చకులు మకరంద్ శాభాయ్, సుహాస్ శాభాయ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలో భాగంగా పుణ్యాహవచనం, గణపతి గౌరీ పూజలు జరిపి నవకలశాలతో పుణ్య జలాలను పూజించారు. శివపార్వతులకు వేదమంత్రాలతో అభిషేకం నిర్వహించి కోనేరులో అర్చకులు శివపార్వతులకు స్నానం చేయించారు. అనంతరం శివపార్వతులకు నూతన వస్త్రాలతో అలంకరించి విశేష పుష్పార్చన, పుష్పయాగం చేశారు. భక్తులు హరహర మహాదేవ నామస్మరణలతో స్వామికి విశేష చక్రతీర్థ పూజలు అర్చకులు నిర్వహించి ఆలయ గర్భగుడిలోకి మేళ తాళాలతో తీసుకెళ్లి శివారాధన చేశారు. సాయంత్రం ఆలయ సాంప్రదాయాన్ని అనుసరించి భక్తి పాటలతో ఏకాంత సేవ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నీలేష్, శేఖర్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీరాం రవీందర్ గుప్త, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ఒక నామినేషన్ దాఖలు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు బుధవారం ఒక నామినేషన్ దాఖలైంది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం దేవునిగూడకు చెందిన గవ్వల శ్రీకాంత్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్ అందజేశారు. ఇప్పటి వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నలుగురు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి తొమ్మిది మంది నామినేషన్లు దాఖలు చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ



కాకతీయ ఇంజనీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు

మాక్లూర్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాణిక్‌బండార్ శివారులో గల కాకతీయ ఇన్సిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు విద్యార్థులకు అవగాహన కలిపంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హ్యాకింగ్ అనుమతి లేకుండా డెటా లేదా కంప్యూటర్ వ్యవస్థలో ప్రవేశించడం, ఫిషింగ్, ఈమెయిల్ మోసాలు, వ్యక్తిగత సమాచారం దొంగిలించే, మోసపూరిత మెసెజ్‌లు పంపడం, గుర్తింపు దొంగతనం, ఇతరుల వివరాలు అక్రమంగా ఉపయోగించి మోసాలు చేయడం వంటి సూచించారు. మత్తుపదార్థాలకు దూరంగా ఉంటూ చదువుపై ఏకాగ్రత పెంచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సైబర్ క్రైమ్ ముకీంపాషా, ఎస్సై రాజశేఖర్‌తో పాటు కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పాలి: ఎంపీడీవో

వేల్పూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడి కేంద్రాలలో చిన్నారులు, పిల్లలకు ఆటపాటలతో విద్యబుద్ధులు నేర్పాలని ఎంపీడీవో బాలకిషన్ సూచించారు. బుధవారం వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో అంగన్‌వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసిన పాలు, పప్పు, బియ్యం, నూనె, వస్తువులను వాటికి సంబంధించిన స్టాక్ రికార్డులను పరిశీలించారు. వండిన వంటకాలను ఆయన రుచి చూశారు. కేంద్రాలకు పిల్లలు ఎక్కువ సంఖ్యలో వచ్చేలా చూడాలని, అందుకు ప్రభుత్వం సరఫరా చేసిన ఆట వస్తువులతో వారిని ఆడిస్తూ విద్యబుద్ధులు నేర్పాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సహాయకార్యదర్శి లింబాద్రి, అంగన్‌వాడి టీచర్ బాబాయమ్మ, ఆయలు, తల్లులు, గర్భిణీలు, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ అటవీ శాఖ కార్యాలయంలో

సమయపాలన పాటించని సిబ్బంది

● కన్నెత్తి చూడని జిల్లా ఉన్నతాధికారులు



బాన్సువాడ అటవీ శాఖ కార్యాలయం



కార్యాలయంలో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ కుర్చీ

బాన్సువాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ అటవీశాఖ కార్యాలయంలో కార్యాలయ సిబ్బందితో పాటు ఓ అధికారి తమ విధులకు ఇష్టానుసారంగా హాజరవుతున్నారు. ఓ అధికారి అయితే ఇంటి వద్ద నుంచే కార్యకలా పాలు కొనసాగిస్తుండగా కార్యాలయ సిబ్బందిలోని సీనియర్ జూనియర్ అసిస్టెంట్లు తమ ఇష్టం వచ్చినప్పుడు విధులకు హాజరవుతూ యథా రాజా.. తథా ప్రజా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా కొంతమంది అధికారులు మాత్రం ఫీల్డ్ పర్యవేక్షణ చేస్తున్నా మంటూ విధులకు ఎగనామం పెడుతున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి. బాన్సువాడ పట్టణం లోని అటవీశాఖ కార్యాలయంలో ఓ సీనియర్ అసిస్టెంట్ అధికారిని తమ ఇష్టం వచ్చినట్లు విధులు హాజరవుతూ ఎగనామం పెడుతూ కార్యాలయానికి వెళితే ఖాళీ కుడిచే దర్శనమిస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇది ఇలా ఉంటే మరో అధికారి సెక్షన్ ఆఫీసర్ కార్యాలయంలో విధులు నిర్వహిం చాల్సి ఉన్నపటికీ ఇంటికే పరిమితమై అక్కడి నుండే కార్యకర్తలు కొనసాగిస్తూ ఇష్టం వచ్చినప్పుడు కార్యాలయానికి వచ్చి సంతకాలు పెడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇదంతా బాన్సువాడ ఫారెస్టు రేంజ్ అధికారి కనుసన్నల్లో జరుగుతున్నప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదని ఎవరైనా అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని కొంత మంది సిబ్బంది పేర్కొనడం గమనార్హం. కార్యాలయంలో పని చేసే సిబ్బందికి అందరికి ఒకే విధంగా విధులు ఉండాల్సి ఉన్నప్పటికీ రేంజ్ పరిధిలోని అధికారి తనకు ఇష్టం వచ్చిన సిబ్బందికి సపోర్టు చేస్తూ సిబ్బందిపై మండిపడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరుగుతున్న జిల్లా ఫారెస్టు అధికారులు మాత్రం బాన్సువాడ ఫారెస్టు కార్యాలయంపై కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. అదేవిధంగా ఇప్పటివరకు ఇంచార్జి అధికారి సైతం పర్య వేక్షించిన దాఖలాలు లేవు. బాన్సువాడ ఫారెస్టు కార్యాలయంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి విధులకు ఎగనామం పెడుతున్న సిబ్బందిపై అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్

● కలుషితమవుతున్న తాగు నీరు ● నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు

రుద్రూర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండల కేంద్రంలోని 9 వ వార్డు శ్రీ రామలింగ చౌడేశ్వరి ఆలయం ప్రక్కన గల వాటర్ ట్యాంక్ పూర్తిగా శిథిలావస్థకు చేరి, పెచ్చులు ఊడిపోయాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ వాటర్ ట్యాంక్ ఎప్పుడు కూలుతుందోనని కాలనీవాసులు భయందోళనకు గురవుతున్నారు. ఈ శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్ గురించి అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని కాలనీవాసులు వాపోతున్నారు. ఈ వాటర్ ట్యాంక్‌కు గత ఐదేళ్ల నుంచి మెట్లు కూడా లేవని, కలుషితమైన త్రాగు నీరు వస్తుందని, ఈ నీరు తాగడం వలన చర్మవ్యాధులు, ఇతర వ్యాధులు వ్యాపించి అనారోగ్యాల భారిన పడి ఆసుపత్రులు పాలవుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్‌పై దృష్టి సారించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



రుద్రూర్‌లో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు

కెనరా బ్యాంకు, ఏటీఎం ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

● బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు

ఎడపల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండల కేంద్రంలో గల కెనరా బ్యాంకు పరిసరాలతో పాటు, ఏటిఎం ముందర సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని బ్యాంకు మేనేజర్‌కు బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు సూచించారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఎడపల్లి మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు ప్రక్కనే గల ఏటీఎంలో చోరీ చేయడానికి ప్రయత్నించారని, అదే సమయంలో పెట్రోలింగ్‌లో ఉన్న పోలీసులను చూసి దొంగలు పారిపోవడంతో ఎలాంటి నష్టం జరుగలేదని, దొంగతనానికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బ్యాంకు మేనేజరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డితో కలిసి బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు ఏటిఎంను, బ్యాంకు పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతూ బ్యాంకు పరిసరాతోపాటు, ఏటిఎం ముందర కూడా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సీసీ కెమెరాలు బయట ఉండడంతో ఎవరెవరు ఏటిఎంలోకి వచ్చారో తెలుస్తుందని, ఏటిఎం ముందే ఉన్న సీసీ కెమెరాలో తాము పడకుండా దానిని అదుపు చేసి దొంగలు గుర్తు పట్టకుండా జాగ్రత్త పడుతున్నారని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎడపల్లి ఎస్సైతో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఎడపల్లి కెనరా బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న బోధన్ రూరల్ సిఐ విజయ్ బాబు



బియ్యం తీసుకెళ్తున్న మహిళ





రేషన్ షాపుల వద్ద క్యూ కట్టిన జనాలు



ఫొటో న్యూస్

రేషన్ షాపుల్లో సన్నబియ్యం.. బారులు తీరిన జనం!



రేషన్ తూకం వేస్తున్న దృశ్యం

రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా ఆహార భద్రత కార్డులు కలిగి ఉన్న కుటుంబాలకు సన్న బియ్యాన్ని ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఈ నెల కోటా కింద రేషన్ షాపులకు సన్నబియ్యాన్ని సరఫరా చేసింది. మంగళవారం రేషన్ షాపులకు సన్న బియ్యం వచ్చినప్పటికీ రథసప్తమి సందర్భంగా చాలా మంది దుకాణాలకు రాలేదు. బుధవారం ఉదయం నుంచి రేషన్ షాపులకు బారులు తీరారు. ఇదివరకు దొడ్డు బియ్యంపై ఆసక్తి చూపని ప్రజలు సన్న బియ్యం కావడంతో రేషన్ షాపుల ముం దు క్యూ కట్టారు. ఉదయం నుంచి డీలర్లు వచ్చిన వారికి టోకెన్‌లు ఇచ్చి బియ్యాన్ని పంపిణీ చేశారు.

● (ఆంధ్రజ్యోతి, నిజామాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)



ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు


సంబరాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏబీసీడీ వర్గీకరణపై క్యాబినెట్ ఆమోదం పొంది అసెంబ్లీలో తీర్మానం చేయడంపై ఎంఆర్‌పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని పూలాంగ్ చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మందకృష్ణ మాదిగ, మేడిపాపన్న చిత్రపటాలకు పూలమాలలు వేసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ నగర అధ్యక్షుడు మల్లమారి సుధాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయ పార్టీలకు అతీతంగా నిండు అసెంబ్లీలో ప్రతిపక్షాలను ఎండగడుతూ దామాషా ప్రకారం మాదిగ ఉపకులాలకు 9 శాతం రిజర్వేషన్ కల్పించాలని తీర్మానం చేయడం గొప్ప విషయమన్నారు. మాదిగ జాతి ఉపకులాలు ముఖ్యమంత్రికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్, పోసాని, సామెల్, అశోక్, రవి, గంగారాం, పోతన్న, చిరు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడుతుంది



రక్తదాన శిబిరం దృశ్యం

బోధన్‌రూరల్,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుందని బోధన్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ఆజాం గంజ్‌లోని ఆర్టీసీ కాలనీలో ఆరోగ్య జ్యోతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత స్వచ్ఛందంగా పాల్గొని 192యూనిట్ల రక్తాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆరోగ్య జ్యోతి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకురాలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నామని, ఈ సారి యువత పెద్ద ఎత్తున రక్తదాన శిబిరంలో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ సుమంత్, డాక్టర్ అబ్దుల్ రహీం, పీఆర్‌టీయూ మాజీ అధ్యక్షులు రవి కిరణ్, బుజ్జి, శరత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అంతరిక్ష ఉపగ్రహా నమూనాల ప్రదర్శన

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):అబ్దుల్ కలామ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సెలెన్స్ డీఆర్‌డీవో మరియు ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాకేట్‌లు, ఉపగ్రహాలు, మిసైల్స్ వంటి అంతరిక్ష ఉపగ్రహ నమూనాల ప్రదర్శన గురువారం నగరంలోని ఉమెన్స్ కళాశాలలో ప్రారంభించనున్నారు. ఈ నెల 6వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలలో ఈ ప్రదర్శన నిర్వహించనున్నారు. గురు, శుక్ర వారాలలో నగరంలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో ఉదయం 9.30ల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వ హించనున్నారు. ఈ కార్యక్రమానికి ఇస్రో నుంచి అధికారులు, సిబ్బంది వచ్చి నమూనాలను విద్యార్థులకు పరిచయం చేస్తూ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి ఏ విధంగా పనిచేస్తాయో వివరిం చనున్నారు. జిల్లాలోని ప్రతి పాఠశాలల నుంచి 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనాలని ఉమెన్స్ మహిళా కళాశాల కమిటీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నిత్యానం దంలు కోరారు. ఉమెన్స్ కళాశాల మైదానంలో ఈ ప్రదర్శ నను నిర్వ హించనున్నారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డుకు ఎంపికైన విద్యార్థిని


విద్యార్థిని వంశీకను అభినందిస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 7వ బెటాలియన్ పక్కన గల వాణి హైస్కూల్ లో 1వ తరగతి చదువుతున్న గుట్ట వంశీక విద్యార్థిని తెలుగు బుక్‌ఆఫ్ రికార్డుకు పేరిని నాట్య ప్రదర్శనకు ఎంపికైంది. రాష్ట్రంలోనే మొదటి సారి జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో 216 మంది విద్యార్థినులు ఒకే వేదికపై నాట్య ప్రదర్శన చేయగా తెలుగు బుక్‌ఆఫ్‌రికార్డు జూరీమెంబర్స్ తిలకించి వంశీక పేరుని నమోదు చేయించ డం జరిగింది. ఈసందర్భంగా వాణి హైస్కూల్ కరస్పాండెంట్ నబీప్రధానోపాధ్యాయులు మోహా న్ రాజు, సిబ్బంది వంశీకను అభినం దించారు.ఈకార్యక్రమంలో సన్మాన గ్రహీత తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేయి గొంతులు.. లక్ష డప్పుల కార్యక్రమం వాయిదా

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వేయి గొంతులు లక్ష డప్పుల కార్యక్రమం వాయిదా పడినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనుక ప్రమోద్ తెలి పారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో వేయి గొంతులు లక్ష డప్పుల కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా మం దకృష్ణ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని వాయిదా వేస్తు న్నట్లు తెలిపారు. మాదిగ కులబాంధ వులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

ఖిల్లా డిచ్‌పల్లి గ్రంథాలయ సందర్శన


ఖిల్లా డిచ్‌పల్లిలో గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న టీయూ వీసీ యాదగిరి రావు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు పాఠశాలలో ఉన్న గ్రంథాయాన్ని ప్రతీరోజు సందర్శించి మేధాశక్తిని పెంచుకోవాలని లైబ్రెరికి కావాల్సిన సౌకర్యాలను తప్పకుండా ఏర్పాటుకు చర్యలు తీసు కుంటానని జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ రాజారెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఖిల్లా డిచ్ పల్లి ప్రభుత్వ పాఠశాలలోని లైబ్రెరిని ఆయన సందర్శించి అక్కడి సమస్యను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు సీతయ్య కోరిక మేరకు ప్రభుత్వ పరంగా లైబ్రెరికి సహాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

● లైబ్రెరీని సందర్శించిన టీయూ వీసీ

ఖిల్లాడిచ్‌పల్లి లైబ్రెరిని తెలంగాణ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ.యాదగిరిరావు బుధవారం సందర్శించారు. లైబ్రెరిలో ఉన్న పుస్తకాల వివరాలను ప్రదానోపాధ్యాయుడు సీతయ్య వీసీ కి వివరించారు.

రాబోయే ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

● పనిచేసే వారికే పార్టీ పదవులు : కులాచారి దినేష్


దినేష్‌కు స్వాగతం పలుకుతున్న పార్టీ నేతలు

ఇందల్వాయి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ పార్టీ జెండా అన్ని గ్రామాల్లో ఎగరవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్ అన్నారు. రెండోసారి బీజేపీ జిల్లా అధ్యక్ష పదవి దక్కడంతో ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద బీజేపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మా ట్లాడారు. కార్య కర్తలే బీజేపీ పార్టీకి పునాదులు అని కష్టపడి పార్టీ కోసం పనిచేసే వారికే పార్టీ పదవులు వస్తాయని అన్నారు. కార్యకర్తలు లేనిది బీజేపీ పార్టీ లేదని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ ఒక్క కార్యకర్త బీజేపీ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని అన్నారు. రెండో సారి జిల్లా అధ్యక్ష పదవి దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరికి సీటు వచ్చిన అందరూ కలిసికట్టుగా పార్టీ కోసం కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మాట లను నమ్మవద్దని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మం డల అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు నాయిడి రాజన్న, మాజీ సర్పంచ్ మోహన్ రెడ్డి, కేపీ రెడ్డి, ఉప్పు సవిత, లక్ష్మణ్, కన్నె చిన్ని, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్య ర్థులు సత్తా చాటాలని అందుకు బీజేపీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ పటేల్ కులచారి అన్నారు. రెండోసారి బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియామకం అయిన తర్వాత ఆయన డిచ్‌పల్లికి మొదటి సారిగా రావడంతో బీజేపీ నాయకులు , కార్యకర్తలు భారీ గజమాల వేసి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధ్యక్షుడి రెండోసారి తనకు అవకాశం కల్పించిన రాష్ట్రఅధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ అర్వింద్‌లను ధన్యవాదలు తెలిపారు. కార్యకర్తలకు తాను ఏ సమయంలోనైనా అండగా ఉంటానని పార్టీ అభ్యున్నతి పాటుపడదమని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని సిరికొండ, డిచ్‌పల్లి, ఇందల్వాయి, జక్రాన్‌పల్లి, మోపాల్ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరికొండ:నిజామాబాద్ జిల్లా అధ్యక్షునిగా రెండవ సారి ఎన్నికై జిల్లాకు వచ్చిన దినేష్ కులాచారికి సిరికొండ మండల బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ నాయకుడిపై పార్టీ అధిష్టానం నమ్మకం ఉంచి రెండవసారి అధ్యక్షునిగా నియమించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు రాజేశ్వర్, రాజేశ్వర్‌రెడ్డి, రామస్వామి, సంజీవ్, శంకర్, బాబురావు, సతీష్ తదితరులు ఉన్నారు.

బడ్జెట్‌ను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్మిక సంఘ నాయకులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ కార్మిక సంఘాల సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద బుధవారం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు శోభన్, నూర్జహాన్, సుధాకర్, హన్మాండ్లు, భూమయ్య, శివలు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ తీరు చూస్తే ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తుందో అర్థమవుతుందని అన్నారు. కార్పొరేట్ సంపన్న వర్గాలకు దేశ సంపదను దోచిపెట్టే విధంగా బడ్జెట్ రూపకల్పన చేయడం జరిగిందన్నారు. బీజేపీ మతోన్మాద ఆర్థిక దివాలాకోరుత నానికి నిదర్శనమన్నారు. దేశంలో సంపద సృష్టించే కార్మికులు, కర్షకులు పేద ప్రజల పైన భారాలు మోపే పద్ధతిలో బడ్జెట్ ఉండటం సిగ్గుచేటన్నారు. కార్మికుల కనీస వేతనాలు పెంచే ఆలోచన బడ్జెట్‌లో లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదరికం నిరుద్యోగుల సామాన్యులపై ధరల భారం పెరిగే విధంగా ఉందన్నారు. బడ్జెట్‌ను ప్రతీ ఒక్కరు వ్యతిరేకించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక కార్మిక విధానాలను అనుసరిస్తూ అంబానీ, ఆదానీ, బడా కార్పొరేట్ శక్తులకు గులాంగిరి చేస్తుందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించు కునేందుకు ప్రభుత్వంపై పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రాబోయేకాలంలో కార్మిక వర్గం కార్పొరేట్ పెట్టుబడి దారులకు ఊడిగం చేసే బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ.రమేష్‌బాబు, దేవేంద్ర, చక్రపాణి, వెంకటేశ్, గంగాధరప్ప, వెంకన్న, మల్లేష్,కిషన్,మురళి,రవి, విఘ్నేష్, రాములు,రఫీక్,రాజు, చక్రీ పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా తీసుకోవాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):నగర పాలక సంస్థ పరిధిలోని వ్యాపారస్తులు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్సులను తీసుకోవాలని నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ రాజేంద్రకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని అన్ని వ్యాపార సంస్థలను తనిఖీ చేయాలని ట్రేడ్ లైసెన్స్ ఉన్నాయా లేదో చూసి ట్రేడ్ లైసెన్సులు లేకుండా వ్యాపారాలు చేస్తే నోటీసులు జారీ చేయాలని అన్నారు. జీవో నంబర్ 149 ప్రకారం ప్రతి ఒక్కరు ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. వ్యాపారులు తమ వ్యాపారాన్ని ప్రారంభించే ముందు ట్రేడ్ లైసెన్సు పొందాలని ట్రేడ్ లైసె న్సు పొందిన వ్యాపారులు ప్రతీ సంవత్సరం రిన్యూవల్ చేసుకోవాలన్నారు. మార్చి 31 వరకు ట్రేడ్ లైసెన్సులు రినివల్ చేసుకోవాలన్నారు. జూన్ 30 వరకు 25 శాతం పెనాల్టీతో ట్రేడ్ లైసెన్సు చెల్లింపు ఉంటుందన్నారు. జూన్ తర్వాత చెల్లించకపోతే 50 శాతం పెనాల్టీతో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్సు పొంది నగర పాలక సంస్థకు సహకరించాలని కోరారు.

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

నవీపేట,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 28న జరిగే జాతీయ సైన్స్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కోయెడి నర్సింలు కోరారు. బుధవారం ఆయన నవీపేటలో మాట్లాడుతూ మూఢనమ్మకాలను నిర్మూలించడంతో పాటు విజ్ఞాన సమాజాన్ని రూపొందించడానికి విద్యార్థులలో చిన్నతనం నుండే శాస్త్రీయ దృక్పధాన్ని పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక నాయకులు శ్రీరాం గౌడ్, లక్ష్మణ్ రాజ్, కిషన్, రాజశేఖర్, గంగాధర్ తదితరులున్నారు.

కుష్ఠు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజేష్‌రెడ్డి

సిరికొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు కుష్టు వ్యాధి, నూలిపురుగు నివారణపై వైద్యాధికారి డాక్టర్ అరవింద్ అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రాజేష్‌రెడ్డి అధ్యక్షతన మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ చర్మం పైన నొప్పి లేని గోదుమ లేదా తెలుపు మచ్చలు ఉంటే అది కుష్టువ్యాధి కావచ్చని అన్నారు. అలాంటి మచ్చలు ఉన్న వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. జాతీయ నూలిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా పిల్లలందరికి ఫిబ్రవరి 10వ తేదీన ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తామని పిల్లలందరూ మాత్రలను భోజనం చేసిన తర్వాత వేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్య సిబ్బంది స్వరూప, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తిలక్‌గార్డెన్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-2 ఏడీఈ ప్రసాద్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఎల్లమ్మగుట్ట, ద్వారకనగర్, హైదరాబాద్ రోడ్, ఖలీల్‌వాడి, ఆర్పీరోడ్, ప్రభుత్వ ఆసుపత్రి, ఆజామ్‌రోడ్, కసాబ్‌గల్లీ, పోచమ్మగల్లి, తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రయోగ పరీక్ష కేంద్రాల తనిఖీ

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ ప్రయోగ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి రవికుమార్ బుధవారం నగరంలోని పలు ప్రైవేటు కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రయోగ పరీక్షల తీరు తెన్నులను పరిశీలించారు. నగరంలోని కాకతీయ, ఎస్ఆర్, వెక్టార్, సత్య వొకేషనల్ కళాశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లో జియో ట్యాగింగ్ చేయాలని సీసీ కెమెరాలు పనిచేయక పోతే చర్యలు తప్పవన్నారు. ప్రతీ పరీక్ష కేంద్రాల్లో నిబంధనల ప్రకారం ప్రయోగ పరీక్షలు నిర్వహించాలని హైదరాబాద్ నుంచి ఇంటర్ బోర్డు కమీషనర్ నేరుగా పర్యవేక్షణ చేసేందుకు జియో ట్యాగింగ్ సీసీ కెమెరాలను అమర్చనున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులను అభినందించిన వీసీ


పరేడ్‌లో పాల్గొన్న వలంటీర్లను అభినందిస్తున్న వీసీ

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొన్న తెలంగాణ విశ్వవిద్యాలయ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తరుణ్, కాంటినెంట్ లీడర్ డా.సునీతలను బుధవారం వర్సిటీ వీసీ ప్రొ.యాదగిరి రావు, రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరిలు అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. దేశ అత్యున్నత స్థాయి కార్యక్రమంలో పాల్గొనడం యూనివర్సిటీకి గర్వకారణమన్నారు. ఈకార్యక్రమంలో టీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొ.రవీందర్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డా.స్వప్న, సురేశ్, తదితరులు ఉన్నారు.

దోమల నివారణకు చర్యలు

నవీపేట,ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): నవీపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని బుధవారం మండల బీజేపీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రవీందర్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్ గౌడ్, బాల గంగాధర్, బండారి రాజశేఖర్, అరవింద్, మోస్రా గోపాల్ తదితరులున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలు

వేల్పూర్, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేట్ గ్రామానికి చెందిన తెడ్డు రమేష్ మద్యం తాగి ద్విచక్ర వాహనం నడపగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడని వేల్పూర్ఎస్సై సంజీవ్ తెలిపారు. బుధవారం ఆర్మూర్ కోర్టులో రమేష్‌ను హాజరుపర్చగా గౌరవ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ రెండు రోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్య నేరామని, ఈ విష యాన్ని వాహనదారులు గమనించాలని ఎస్సై సూచిం చారు.

ప్రారంభానికి నోచుకోని గోదాం

మోపాల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచిప్ప గ్రామంలో నిర్మించిన ఎరువుల గోదాం పూర్తయిన ప్రారంభానికి నోచుకోవడం లేదని గ్రామ రైతులు పేర్కొన్నారు. బాడ్సి ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో సుమారు 24లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఎరువుల గోదాం పూర్తయిన కూడా ప్రారంభానికి నోచుకోవడం లేదని ఆయా గ్రామాల రైతులు తెలిపారు. ఇప్పటికైనా బాడ్సి ప్రాథమిక సహకార సంఘం పాలకవర్గం సభ్యులు తొందరగా గోదాంను ప్రారంభించాలని కోరుతున్నారు. సొసైటీ పరిధిలో 13 గ్రామా ల రైతులు ఉన్నారు. బాడ్సి, ముదక్‌పల్లి, కులాస్‌పూర్, మంచిప్ప గ్రామాల్లో ఎరువుల గోదాంలను నిర్మించారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేందుకు ఈ గోదాంల నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని సంబంధిత అధికారులు తెలిపారు. గతంలో సొసైటీ పరిధిలోని రైతులు బాడ్సి గ్రామానికి వచ్చి ఎరువులను తీసుకువెళ్లేవారని రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు గ్రామాల్లో ఎరువుల గోదాంను ఏర్పాటు చేయడం జరిగిందని అధికారులు పేర్కొన్నారు.


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మంచిప్ప ఎరువుల గోదాం

నల్లా బిల్లు కట్టకుంటే కనెక్షన్ కట్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలు నల్లా బిల్లులు చెల్లించాలని నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ రాజేంద్రకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో నల్లా బిల్లులు చెల్లించని కనెక్షన్‌లను బుధవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్న నల్లా బిల్లులను ప్రజలు వెంటనే చెల్లించాలని అన్నారు. ప్రజలు బిల్లులు చెల్లించకుంటే వెంటనే నల్లా కనెక్షన్‌లు తొలగిస్తామన్నారు.

చెట్టును ఢీకొని వ్యక్తి మృతి


మృతుడు హరిసింగ్

సిరికొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):మెట్టుమర్రి తండాకు చెందిన బట్టు హరిసింగ్ (55) బైక్‌పై వేగంగా ప్రయాణిస్తూ చెట్టుకు ఢీకొనడం వల్ల అక్కడికక్కడే మృతి చెందాడు. ఏఎస్సై బాల్‌సింగ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం మధ్యాహ్నం మోటార్ బైక్‌పై కొండాపూర్ వైపు నుంచి సిరికొండకు వస్తుండగా హుస్సేన్‌నగర్ రైస్‌మిల్ సమీపాన బైకు అదుపు తప్పి చెట్టుకు ఢీకొనడంతో పొలంలో పడిపోయి అక్కడికక్కడే చనిపోయాడు. ఏఎస్సై సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమా రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు బాల్‌సింగ్ తెలిపారు. శవ పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

కులగణనలో బీసీ జనాభా లెక్కలపై ప్రభుత్వం సమగ్ర సమాచారం ప్రకటించాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణనలో బీసీ కులాల జనాభా లెక్కలను కులాల వారీగా సమగ్ర వివరాలతో కూడిన సమాచారాన్ని రాష్ట్ర ప్రజల ముందు ఉంచాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బీసీ కులాల సంఘాల నాయకులు ప్రతిపక్షాల పార్టీలు బీసీ కులాల జనాభ లెక్కల వివరాలపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో బీసీ కులాల మేధావులు, ప్రజాప్రతినిధులతో అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి అనుమానాలను నివృత్తి చేయాలని అన్నారు. ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టిన సమగ్ర కులగణన సర్వేపై సమగ్ర చర్చకంటే బీఆర్ఎస్, బీజేపీ తమ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చాయని అన్నారు. ఎస్సీ వర్గీకరణ గెజిటెడ్ విడుదల చేసేముందు మాదిగ, మాల వాటి ఉపకులాల మేధావులతో ప్రభుత్వం చర్చించాలన్నారు. మూడు దశాబ్దాల వర్గీకరణ పోరాటానికి ఇకనైనా సామాజిక న్యాయం సమగ్రాభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేసి దేశానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.180	రూ.250	రూ. 270
వెన్‌కాబ్(కిలో)	రూ.190	రూ.260	రూ. 280

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.86,800	రూ.79,600	రూ.980

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (10.30, 1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : మద గజ రాజ (10.10, 10.45)
: డాకు మహారాజ్ (1.20, 7.40)
: దేవ (హిందీ) (4.25)
స్క్రీన్-3 : దేవ (హిందీ) (10.45, 7.15, 10.30)
: మహిష (2.00)
: రొమాంటిక్ లైఫ్ (4.30)
స్క్రీన్-4 : ఏజెంట్ గయ్ 001 (11.15)
: స్కై ఫోర్స్ (హిందీ) (1.30, 10.25)
: మద గజ రాజ (4.15)
: ప్రేమిస్తావా (7.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్
స్క్రీన్-1 : పట్టుదల (10.50, 1.40, 4.30, 7.20, 10.15)
స్క్రీన్-2 : సంక్రాంతికి వస్తున్నాం (11.00, 1.40, 4.40, 7.25, 10.00)

దేవి : పట్టుదల (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : రాచరికం (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: మద గజ రాజ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్